

# భస్మాసుర హస్తం

బులుసు-జీ-ప్రకాష్

"ఈ అర్జీల దాఖలా దరఖాస్తుదారు లెవరు వచ్చార్రా—బందులూ!"

"ఏరూ రాలా బాబుగారూ!"

"సరిగా చూసే చెబుతున్నావా లేక నిద్దరమత్తుతోనే జవాబిస్తున్నావా?"

"సరిగ్గా చూసే చెబుతున్నా బాబుగారూ! ఒక్కగా నొక్క పిట్టమనిషి ఆఫీసు కివాళ నూతులి కోసరం రాలేదండీ!"

"వరండా అంతా చూశావన్న మాట?"

"కాంపౌండుకూడా గాలించి వచ్చానండీ!"

"అయినా కనబడలేదా?"

"అహఁ పిసరూ కనబడలేదండీ!"

"కాంపౌండు అవతల చూశావురా బందులూ!—అవతల."

"అవతలకూడా చూడాలా బాబుగారూ! అది మన ఆతా కాదే?"

"ఆతా ఏమిట్రా ఆతా! ఈ తాలూకా అంతా మన ఆతావే! అన్నిచోట్లూ గాలించి చూడాలి. చూడకపోతే మనకి రోజు రాబడి వచ్చిదెలారా? పోయి కాంపౌండు అవతల వెతుకు. చెట్లకిందని ఎక్కడైనా నిద్రపోతున్నారేమో చూడు. పల్లెటూరి బైతులికిదో దురలవాటు. బ్రహ్మాండమైన పని పెట్టుకుని వస్తారు. ఇక్కడా, అక్కడా శుష్కంగా నిద్రపోతుంటారు. బొట్టూ కాటుకా పెట్టి, పిల్చుకొచ్చి పనిచెయ్యడానికి తాతగారి నౌకర్లెవరైనా వున్నారా ఏమిటిక్కడ?"

"నేనున్నానుగా బాబూ!"

"పోరా అవతలకి అద్దే పేలక!"

"అవతల లేకపోతే బస్సుస్టాండుకీ, రైల్వేస్టేషనుకికూడా వెళ్ళమని శలవా?"

"ఎందుకూ? మళ్ళీ శెలవుపెట్టకుండా ఆత్తారింటి కుడాయించేద్దామనా?"

"కాదండీ బాబుగారూ! దరఖాస్తుదారు లెవరైనా బళ్ళు దిగుతున్నారేమో చూసి పట్టుకు తీసుకురావడానికి. అక్కడే పట్టుకుంటే అనవసరంగా మరెక్కడికి వెళ్ళరు."

"రైతో. అలానే కానీ."

బందులు కచేరీ కాంపౌండు అవతల చెట్ల మొదళ్ళన్నీ దుర్భిణీవేసి చూశాడు. ఎవరూ కనబడకపోతే స్టాండుమీదుగా స్టేషనుకి బయలుదేరి వెళ్ళాడు.

హెడ్‌గుమస్తా కోపంతో పిటీషన్లు డ్రాయర్లో కుక్కిపారేశాడు. ససేమిరా చదవలేదు. లక్ష్మీ సాక్షాత్కారం జరిగితేనే చదువుతాడు. చేతిలో గలగలా ధనం రాలగానే యంత్రంలా పనిచేస్తుంది చెయ్యి. స్వంతపనిలాగ చకచకా పని జరిగిపోతుంది.

నూతులమీద అధికారి తానుతెప్పించుకున్న మధ్యాహ్న ఫలహారం తిని, తాజాగా హెడ్‌గుమస్తాని దగ్గరికి పిలిపించుకున్నాడు.

"ఎన్ని దరఖాస్తులు మంజూరు చెయ్యాలో తేల్చేరా పంకజాక్షంగారూ!"

"అబ్బే ఎలా తేల్చడమండీ!" అన్నాడు పంకజాక్షం.

"తేల్చడానికేమైనా అడ్డున్నాయా?"

"ఒక్కటే ఒక బ్రహ్మాండమైన అడ్డు. పార్టీ లెవరూ ఇంకా రాలేదు. పోయి తీసుకురమ్మని బందుల్ని పంపిరచాను. వాడూ ఇంకా పత్తా లేదు. రాగానే తేలిపోతుంది లెండి, ఎన్ని మంజూరు చెయ్యాలో ఎన్ని చెయ్యక్ఖర్లేదో!"

"పార్టీలెవరూ రాకపోతే ఏదీ మంజూరు చెయ్యకండి. అసలా పిటీషన్ల వంక చూడనే చూడకండి చేతిలో కాస్తో కూస్తో పడేదాకా కిక్కురు మనకండి. విరాళాలు చవకనుకున్నారు చవటపీనుగులు!" ఆజ్ఞాపించాడు అధికారి.

"చిత్తం సార్!" అని ఒక్క సలాము కొట్టేడు హెడ్‌గుమస్తా.

* * *

"సుభాషిణీ!" అని అరిచాడు హెడ్‌గుమస్తా

"ఏం బాబూ!" అని బందులు హాజరయ్యేడు.

"నువ్వా ఏమిట్రా సుభాషిణివి? ఫూల్!—ఎవర్రా బందులూ ఈ సుభాషిణి? మనిషి కనబడదేం? తమాషా అనుకుందా ఏమిటి? పెద్దదొరసానిలా దరఖాస్తులు పెట్టేయడం, మరి ఆఫీసరు గార్ని కలియడానికి రాకపోవడమూను. ఇవాళో దరఖాస్తు, నిన్ననో దరఖాస్తు, మొన్ననో దరఖాస్తు! కొంపేం మునిగింది ఆఫీసరుగార్కి వచ్చి మొహం చూపిస్తే?" పంకజాక్షం సుభాషిణి సంతకం చూసి డ్రాయర్లో కూరేశాడు.

"పిల్చుకు రమ్మన్నారా యేమిటి బాబూ?"

"పోరా వెధవా! ఎక్కడ వెదుకు తావ్? ఇంత మహాపట్టణంలో ఎవరని కనుక్కుంటావ్?" కసిరేడు పంకజాక్షం

"అదీ నాకు చెప్పాలా బాబూ! రోజూలాగే, అవతల చెట్టుకిందా, బస్టాండూ, స్టేషన్ దగ్గరానూ!" బందులు తన మామూలు ధోరణి వెలిగించాడు.

"ఆ స్థలాల్లో వందలాది జనం వుంటార్రా వెర్రివెధవాయ్! ఇంతమంది లోనూ ఈ సుభాషిణెవరో నీకేం తెల్సు?"

"ఎందుకు బాబయ్యా! ప్రతిద్వారం దగ్గరికీ వెళ్ళి—సుభాషిణీ! సుభాషిణీ! అని అరుస్తాను. ఎవరు పలికితే వాళ్లే సుభాషిణి—"

"ఒకవేళ వచ్చిందనే అనుకో. వస్తే సుభాషిణీ అని నువ్వు పిలవగానే, ఎవర్రా 'నువ్వు రాస్కెల్!' అని దవడపళ్ళు రాలగొట్టేట్టుంది. ఘరానా కుటుంబానికి చెందిన ఆడదేమోచూడు!"

"అలా అయితే ఆఫీసు గుమ్మంలో మళ్ళీ అడుగుపెడుతుందా? జుత్తుపట్టు కుని గడగడా ఈడ్చిపారేయనూ!"

"ఎలాగో వెళ్ళి తగలడు. సుభాషిణిని మాత్రం తీసుకురా!"

బందులు గబగబా ఆఫీసుప్రాంగణం దాటాడు. అలవాటు ప్రకారం చెట్టు కిందకి మొదట వెళ్లేడు.

"సుభాషిణీ! సుభాషిణీ!"

బందులు గబగబా బస్సుస్టాండుకి దౌడు తీశాడు.

"సుభాషిణీ!సుభాషిణీ!"-అరే ఎవరూ లేరే!

మద్రాసు మెయిల్ అప్పుడే స్టేషన్‌లో ఆగింది. బందులు గేటుయివతల నించుని- "సుభాషిణీ! సుభాషిణీ!"అని అరిచి నిష్ఫలుడయేడు.

"ఏదిరా సుభాషిణీ!"

"రాలేదు బాబూ!"

"నే చెప్పేనా వెళ్లొద్దని, చెప్తే విన్నావా వెధవ్వి!"

"రేపొస్తుందేమోనండీ!"

"ఆఁ వస్తుంది. వచ్చినా నువ్వెళ్ళకు. అవసరం ఉన్నప్పుడు అదే వస్తుంది. అసలు నువ్వెళ్ళడం నీదీ పొరపాటు!?"

* * *

"టెలిగ్రామ్ సార్! చేతి కందించాడు బందులు.

ఆఫీసరు, టెలిగ్రాం ఎక్కణ్నుంచి వచ్చిందోనని విప్పకుండానే పరిశీలించాడు. ఊహ కందలేదు. విప్పి చదివాడు గాభరా ఎత్తిపోయాడు. మళ్ళీ చదివాడు. చేతులు వణికాయి. ఇంకా చదివాడు. కళ్లెర్రబడ్డాయ్!

ఆఫీసర్ని చూస్తున్న బందులు భయపడిపోయాడు.

"బందులూ!" వెర్రికేక వేశాడు అధికారి.




"ఏంబాబూ!" ఒణికిపోయాడు బందులు.

"రాస్కెల్! ఎక్కడున్నా వింత సేపూ?"

"ఇక్కడే! తమ దగ్గిరే బాబూ!"

"హెడ్‌గుమస్తాని రమ్మను!" ఉక్రోషంతో అన్నాడధికారి.

పంకజాక్షం హాజరయ్యాడు అధికారి ముందు.

"సుభాషిణి అనే పేరుతో ఏమైనా టపాలొచ్చేయా?"

"వచ్చేయి సార్?"

"నా యెదుట ఎందుకు పెట్టలేదు?"

"పార్టీ లెవరూ రాకపోతే చూడాద్దన్నారు కదండీ!"

"పిడుక్కీ బియ్యానికీ ఒక్కటే మంత్రమా? వెళ్ళి పట్టుకురా!"

పంకజాక్షం తేవడానికి వెళ్ళేడు. వెళ్తూ, కొంపదీసి సుభాషిణి హెడ్డాఫీసుకి కంప్లెయింట్ చేసిందేమోనని భయపడుతూ, డ్రాయర్‌లోని టపాతీసి ఇక రక్షించేభారం నీదేనన్నట్లు, భక్తి వినయపూర్వకంగా అధికారి చేతి కందించాడు.

అధికారి ఆమూలాగ్రం చదువుకుని ఆపాదమస్తకం కంపించిపోయాడు.

"చంపేశావ్! ఈ టెలిగ్రామ్ చూడు!" పంకజాక్షం చేతికందిస్తూ కుర్చీలో చేరబడిపోయాడు.

పంకజాక్షం వొణుకుతూ చదివేడు.

"మూడుత్తరాలు. ఎప్పటికీ మీరు రాలే–జబ్బుతో బేబీ మనల్ని వీడిపోయింది–సుభాషిణి."

"క్షమించండి సార్!!"